సాక్షి
జనగామ
శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023

ఘనంగా ఎదుర్కోలు తంతు

జీడికల్ వీరాచల శ్రీరామచంద్రస్వామి కల్యాణోత్సవంలో భాగంగా గురువారం రాత్రి వేదపండితులు ఎదుర్కోలు తంతు నిర్వహించారు. శుక్రవారం జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఈఓ శేషభారతి, జూనియర్ అసిస్టెంట్ రాములు, భక్తులు పాల్గొన్నారు.

– లింగాలఘణపురం



గరిష్టం/కనిష్టం
31^0 /20^0

వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి పూట చలి తీవ్రత మరింత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

గులాబీ జెండా ఎగురుతుంది



బచ్చన్నపేట: జనగామలో గులాబీ జెండా ఎగురుతుంది.. ఈ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అడ్డా అని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన పోచన్నపేట, ఆలింపూర్, బచ్చన్నపేట పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి తప్పుడు ప్రచారం చేసినా గెలుపు బీఆర్‌ఎస్‌దే అని అన్నారు. ఆయన వెంట రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి, సర్పంచ్‌లు వడ్డెపల్లి మల్లారెడ్డి, నరెడ్ల బాల్‌రెడ్డి, నాయకులు వడ్డెపల్లి ఉపేందర్‌రెడ్డి, పూర్ణచందర్, కొండి వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

కాంగ్రెస్‌దే విజయం



జనగామ: అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకునేందుకు చేయి గుర్తుకు ఓటు వేసిన జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాల పైన నమ్మకం, బీఆర్‌ఎస్‌పై వ్యతిరేకత, తనపై ఉన్న భరోసాతో 50వేల మెజార్టీపై గెలువ బోతున్నట్లు పేర్కొన్నారు.

ప్రజాతీర్పును గౌరవించాలి



స్టేషన్‌ఘన్‌పూర్: ఏ రాజకీయ పార్టీ అయినా ప్రజా తీర్పును గౌరవించాల్సిందేనని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. ఘన్‌పూర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారని, ఇంకా చేయాల్సి ఉందన్నారు. మూడోసారి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని పేర్కొన్న ఆయన.. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ బలంగా ఉందని స్వయంగా సీఎం చెప్పారని అన్నారు. రానున్న రోజుల్లో కేసీఆర్ చెప్పినట్లు ప్రజలు గెలవాలి.. వారి అభిప్రాయం గెలవాలన్నారు.

హ్యాట్రిక్ సీఎం కేసీఆర్



రఘునాథపల్లి: అభివృద్ధి, సంక్షేమానికి మరోసారి తెలంగాణ ప్రజలు అండగా నిలుస్తున్నారు.. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవుతారని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పొన్నాల లక్ష్మయ్య అన్నారు. గురువారం ఆయన స్వగ్రామం మండలంలోని ఖిలాషాపూర్‌లో సతీమణితో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్లుగా ఆర్థిక, ఉపాధి, తలసరి ఆదాయం, సంక్షేమం అన్ని రంగాల్లో బీఆర్‌ఎస్ ముందున్నదని చెప్పారు. కాంగ్రెస్‌పై ప్రజలకు విశ్వాసం లేదని, 3వ తేదీన రాష్ట్ర ప్రజల మనోగతం బయట పడుతుందని పేర్కొన్నారు. ఆయన వెంట వై.కుమార్‌గౌడ్, వారాల రమేష్, మల్కపురం లక్ష్మయ్య, కావటి రాజయ్య, కట్ల సదానందం తదితరులున్నారు. అంతకు ముందు గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు దుబ్బాక ఉత్తరయ్య ఉదయం మృతి చెందడంతో మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పోలింగ్ కేంద్రంలో డబ్బుల కలకలం

దేవరుప్పుల: స్థానిక హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో గురువారం రాత్రి ఓ ప్రైవేట్ వ్యక్తి చేతిలో డబ్బులు కలకలం రేపాయి. ఎన్నికల అధికారి శ్రీనివాస్ ఓ బూత్‌లో ఈవీఎం మొరాయించగా ఎన్నికల సిబ్బందికి ఇచ్చే రూ.44,200లను మరో అసిస్టెంట్‌కు ఇచ్చారు. ఆయన విధుల్లో నిమగ్నమైన క్రమంలో ప్రైవేట్ వ్యక్తికి అందజేయగా.. అతను ఎన్నికల అధికారి వాహనం డ్రైవర్‌కు అప్పగించే క్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల కంటపడింది. దీంతో సదరు వ్యక్తి బీఆర్‌ఎస్ కార్యకర్త అని.. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బులు పంచుతున్నాడని అక్కడున్న పోలీసు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. విషయాన్ని బీఎస్‌ఎఫ్ జవాన్లు తమ ఉన్నతాధికారికి సమాచారం ఇవ్వగా బీఎస్‌ఎఫ్ కమాండెంట్ శ్రీహర్మీత్‌సింగ్ వచ్చి విచారణ చేపట్టి డబ్బులు ఎన్నికల ఖర్చువేనని.. రికార్డులు సరిచూసుకుని ప్రాథమికంగా గుర్తించారు.

ఓటు హక్కును వినియోగించుకున్న కలెక్టర్ దంపతులు, పాలకుర్తి, జనగామ, ఘన్‌పూర్ అభ్యర్థులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఆరుట్ల దశమంతరెడ్డి, సింగపురం ఇందిర, లేగ రామ్మోహన్‌రెడ్డి










85.74 %

జిల్లాలో పోలింగ్ నమోదు

జిల్లాలో పోలింగ్ సరళి

సమయం	జనగామ	స్టేషన్‌ఘన్‌పూర్	పాలకుర్తి
9 గంటలు	10.84	9.00	9.4
11 గంటలు	24.53	23.00	22.28
1 గంట	43.74	44.60	44.57
3 గంటలు	62.23	62.40	62.10
5 గంటలు	83.34	76.25	81.23
మొత్తం	84.01	86.44	86.68



జనగామ నియోజకవర్గ కేంద్రంలోని గోకుల్ నగర్ ప్రభుత్వ పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి బారులుదీరిన ప్రజలు

- పాలకుర్తిలో అత్యధికంగా నమోదు
- గొడవలు, లాఠీచార్జ్‌లు, తోపులాటలు
- నాగారంలో రాత్రి 8.45 వరకు కొనసాగిన ఓటింగ్
- స్ట్రాంగ్ రూంకు ఈవీఎంలు
- 2018 కంటే తగ్గిన పోలింగ్ శాతం

జిల్లాలోని పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల్లో గురువారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సజావుగా ముగియగా.. జనగామ నియోజకవర్గంలో గొడవలు, తోపులాటల మధ్య హైటెన్షన్ వాతావరణం చోటుచేసుకుంది. ఉదయం 7 గంటలకు రెగ్యుల్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా.. రాత్రి 8.45 గంటలకు పూర్తయింది. – జనగామ

జిల్లాలో 85.74 శాతం పోలింగ్ నమోదు కాగా.. పాలకుర్తిలో అత్యధికంగా 86.68 శాతం ఓటింగ్ జరిగింది. జనగామలో 84.01 శాతం, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 86.44 శాతం పోలింగ్ నమోదైయింది. 2018లో 87.48 శాతం పోలింగ్ జరగ్గా ఈసారి యువ ఓటర్ల సంఖ్య పెరిగినప్పటికీ 1.77 శాతం తక్కువ నమోదు కావడం గమనార్హం. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల పరిధి పలు పోలింగ్ బూత్‌లో ఈవీఎంలు మొరాయించడంతో 10 నుంచి 20 నిమిషాల ఆలస్యంగా ఓటింగ్ ప్రక్రియ మొదలైయింది. చలిమంచు కారణంగా మొదటి రెండు గంటలు(9 వరకు) జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పోలింగ్ మందకొండిగా సాగింది. 9 నుంచి 11 గంటల వరకు కొంత మేర పెరగ్గా.. సాయంత్రం 5 గంటల వరకు 80 శాతానికి పైగా దాటింది. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాల లోపల ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. ఓటింగ్ పూర్తయిన అనంతరం పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలను సీల్ చేసి స్ట్రాంగ్ రూంకు తరలించారు. పాలకుర్తిలో ఓటర్లను బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు, కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినిరెడ్డి ఆప్యాయంగా పలకరించారు. చేర్యాల పరిధిలో ఒకటి, రెండు చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. ఆకునూరు పోలింగ్ కేంద్రం వద్దకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి డబ్బులు ఇవ్వలేదని బీఆర్‌ఎస్ నాయకుడి ఇంటి ఎదుట పలువురు ఆందోళనకు దిగగా పోలీసులు రంగ ప్రవేశం చేసి పంపించారు. కొమురవెల్లిలో ఓటరు జాబితాలో తన పేరు లేదని ముత్యం వెంకటేశ్ అనే యువకుడు సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. మద్దూరు మండలంలో చెదురు ముదురు సంఘటనలు జరిగాయి.

ఈవీఎంల మొరాయింపు

జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ ఏరియా గౌట్ కళాశాల పోలింగ్ స్టేషన్ 244 బూత్‌లో ఈవీఎంలు మొరాయించాయి. దీంతో ఎనిమిది నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభించారు. సాంకేతిక నిపుణులు వచ్చే వరకు ఓటర్లు నిరీక్షించారు. కాగా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్ర 117వ బూత్‌లో, అలాగే రాఘవాపూర్‌లోని 147, 148వ బూత్‌లలో ఉదయం ఈవీఎంలు మొరాయించడంతో దాదాపు అరగంటకు పైగా పోలింగ్ ఆలస్యమైంది. బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామం 115 బూత్, చిల్పూరు మండలం రాజవరం, పాలకుర్తి మండలం వావిలాల 112 బూత్, తరిగొప్పుల మండలం పోతారంలో ఈవీఎంల మొరాయింపులతో ఓటింగ్ ప్రక్రియ ప్రారంభంలో జాప్యం జరిగింది. దీంతో ఓటర్లు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

నాగారంలో రాత్రి 8.30 వరకు పోలింగ్



లింగాలఘణపురం: మండల పరిధి నాగారంలో ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ రాత్రి 8.30 గంటలకు ముగిసింది. 201 పోలింగ్ బూత్‌లో 1,051 ఓట్లు ఉన్నాయి. ఇందులో మంథోనిగూడెం జీపీకి చెందిన చిక్కులోనిగూడెం ఓటర్లు ఉండడంతో వారిని గుర్తించేందుకు ఏజెంట్లు కొంత జాప్యం చేయడం ఆలస్యానికి కారణంగా తెలుస్తోంది. అలాగే ఎన్నికల విధుల్లో ఉన్న పంచాయతీ సిబ్బంది చిక్కుడు సత్యరాములుకు ఫిట్స్ వచ్చి కింద పడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావం కావడంతో అతడిని ప్రైవేట్ వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించే సమయంలో సుమారు గంట వరకు పోలింగ్ నిలిచి పోయింది. దీంతో 5 గంటలకు ముగియాల్సిన పోలింగ్ రాత్రి 8.30 గంటలకు వరకు కొనసాగింది. ఆ సమయంలో ఓటర్లు కొంత అసహనానికి గురికావడంతో పోలీసు సిబ్బంది చేరుకొని అందరిని శాంతపరిచి పోలింగ్‌ను ప్రశాంతంగా కొనసాగేలా చూశారు.

అంబేడ్కర్ నగర్ పోలింగ్ బూత్ వద్ద ఘర్షణ

- కాంగ్రెస్ వర్సెస్ బీఆర్‌ఎస్
- పోలీసుల లాఠీచార్జ్



ఏసీపీతో వాగ్వాదం చేస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: పట్టణంలోని అంబేడ్కర్ నగర్ 270 పోలింగ్ బూత్ వద్ద గురువారం రాత్రి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పోలింగ్ సమయం ముగిసిన తర్వాత కేంద్రం గేట్లు మూసివేసి.. సాయంత్రం 5 గంటల వరకు లోపల ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ఈ సమయంలో అక్కడికి వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుమారుడు ప్రశాంత్‌రెడ్డి.. తమ పార్టీకి చెందిన ఏజెంట్ బూతులో ఎవరూ లేరూ.. తాను వెళ్తున్నట్లు ఎన్నికల సిబ్బందికి చెప్పి పోలింగ్ బూత్‌లోకి వెళ్లారు. సుమారు 15 నిమిషాల తర్వాత అనుచరులతో అక్కడికి చేరుకున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి.. కాంగ్రెస్ నాయకులను బూత్‌లోకి ఎలా అనుమతించారంటూ నిలదీశారు. ఆయన కూడా లోనికి వెళ్లి పోలింగ్ తీరును పరిశీలించి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ శ్రేణులు పోలింగ్ కేంద్రం గేటు ఎదుట బైఠాయించి 'పల్లా' గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. దీంతో రాజేశ్వర్‌రెడ్డి వర్గీయులు సైతం బైఠాయించి నిరసన తెలపడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు లాఠీలకు పని చెప్పినా పరిస్థితి అదుపులోకి రాలేదు. గంటన్నరకు పైగా ఇరువర్గాలు తోపులాటకు దిగడంతో అదనపు పోలీసు బలగాలను రప్పించారు. డీసీపీ సీతారాం చేరుకుని నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినిపించుకోకుండా రాజేశ్వర్‌రెడ్డి వర్గీయులతో పాటు పలువురు పోలీసులపై విరుచుకుపడేందుకు ప్రయత్నం చేశారు. ఈ ఘర్షణలో డీసీపీతో సహా సీఐలను నెట్టివేశారు. లాఠీచార్జ్‌లో పలువురు కార్యకర్తలకు స్వల్ప గాయాలయ్యాయి.

ఓట్లడగడం మరిచి నన్ను వెంటాడారు..

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలనే బీఆర్‌ఎస్ ప్రయత్నం చేస్తే.. కాంగ్రెస్ కుట్రలకు దిగిందని బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రజలను ఓట్లు అడగాల్సింది పోయి తన వెంట పడ్డారని అన్నారు.



ఘర్షణ పడుతున్న ఇరు వర్గాలు

కొమ్మూరి వర్సెస్ పల్లా
- పరుష పదజాలంతో మాటలు
- నాలుగు చోట్ల లాఠీచార్జ్

ఉద్రిక్తతలు.. ఘర్షణలు
- పోలింగ్‌కేంద్రాల వద్ద వివిధ పార్టీల శ్రేణుల బాహాబాహీ

ఓటర్లపై పోలీసుల దురుసు ప్రవర్తన

పోల్.. కూల్
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఓటర్ల సందడి ఓటేసిన ప్రముఖులు

- వివరాలు 8లో▸



దేవరుప్పుల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో..



స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్లు గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో బారులుదీరిన ఓటర్లు

అర నిమిషం ఆలస్యమైతే హక్కు కోల్పోవాలా..?

- అధికారుల తీరుపై ఓటర్ల ఆగ్రహం

జనగామ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సాయంత్రం 5 గంటలకు పోలింగ్ కేంద్రం గేట్లు మూసివేసిన నిమిషం తర్వాత ఓటర్లకు అధికారులు నో చెప్పడంతో ఓటు వేయకుండానే వెనుదిరిగారు. పట్టణంలోని 22వ వార్డు బీరప్పగడ్డకు చెందిన యాకూబ్ షరీఫ్ అహ్మద్ ఉదయం పనికి వెళ్లి సరాసరి రైల్వేస్టేషన్ గౌట్ కళాశాల పోలింగ్ కేంద్రానికి వచ్చాడు. అర నిమిషం ఆలస్యమైందంటూ అధికారులు అనుమతించలేదు. 1991 నుంచి ఓటు వేస్తున్నాను.. రాజ్యాంగంలో కల్పించిన హక్కులను సమయంతో అడ్డుకోవడం ఏమిటని సదరు వ్యక్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా 26వ వార్డుకు చెందిన బిక్కు నాయక్ సైతం నిమిషం ఆలస్యంగా చేరుకోవడంతో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కోల్పోయాడు. బీరప్పగడ్డ 23వ వార్డుకు చెందిన కర్రె శ్రీలత, పద్మ పనిమీద బచ్చన్నపేట మండలం చినరామన్‌చర్లకు వెళ్లి వచ్చే సరికి పోలింగ్ కేంద్రం గేట్లు మూసి వేశారు. అధికారులను వేడుకున్నా అంగీకరించక పోవడంతో వెనుదిరిగారు.



ఓటు వేయకుండా వెనుదిరిగిన కర్రె శ్రీలత, పద్మ, యాకూబ్ షరీఫ్ అహ్మద్, బిక్కు నాయక్

ప్రత్యేక కేంద్రాల ఏర్పాటుపై హ్యాపీ

జనగామ: జిల్లాలో మహిళలు, దివ్యాంగులు, యూత్, మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా సెంటర్లలో ఓటర్లను రిసీవ్ చేసుకున్న తీరుకు మహిళలు ఫిదా అయ్యారు. మరింత గౌరవం పెంచేలా ఉందంటూ సంతోషం వ్యక్తం చేశారు. దివ్యాంగుల ప్రత్యేక పీఎస్ వద్ద రెండు వీల్ చైర్లు, ఇద్దరు సేవకులు, తాగునీటితో పాటు ఇతర వసతి కల్పించి వారిని దగ్గరుండి పోలింగ్ కేంద్రానికి తీసుకు వెళ్లారు. ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత వారిని తమ స్థలాలకు తరలించారు. మోడల్ పోలింగ్ కేంద్రాలను బెలూన్లు, పూలు, ఫ్లెక్సీలతో అలంకరించగా.. యూత్ పీఎస్‌లో యువ అధికారులు పని చేశారు. ఓటర్లకు గౌరవంగా ఉందని పలువురు పేర్కొన్నారు.



జిల్లా కేంద్రం బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన మహిళా పోలింగ్ కేంద్రంలో సిబ్బంది

నిఘా నీడలో పోలింగ్

జనగామ: జిల్లా వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ పూర్తిగా నిఘా నీడలో జరిగింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూం నుంచి వెబ్ క్యాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళి, నిర్వహణ ప్రక్రియను పరిశీలించారు. ఈవీఎంల మొరాయింపు తదితర సాంకేతిక సమస్యలు, లోపాలను తెలుసుకుని సంబంధిత అధికారులకు ఫోన్ చేసి తక్షణమే పరిష్కరించేలా ఆదేశించారు.

పోలీసు బందోబస్తు

ఎన్నికల నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు చేపట్టారు. ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర, కేంద్రం జనరల్ అబ్జర్వర్లు, పోలీసు, తదితర పర్యవేక్షకులు అనునిత్యం పరిశీలించారు. డీసీపీ పి.సీతారాం ఆధ్వర్యంలో బీఎస్‌ఎఫ్, సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసులు, ఎక్సైజ్ తదితర విభాగాల బలగాలు బందోబస్తు చేపట్టారు.

వ్యాపార సంస్థల మూసి వేత

అసెంబీల ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేశారు. అలాగే చుట్టుపక్కల వ్యాపార సంస్థలను మూసి వేయడంతో కనీసం టీ దొరకని పరిస్థితి నెలకొంది. సాయంత్రం ఓటింగ్ ముగిసే వరకు దుకాణాలు మూసి వేయగా.. ఆ తర్వాత తెరుచుకున్నాయి.

బూత్‌ల మార్పిడి.. పోల్‌చీటీల గందరగోళం

జిల్లాలో పోలింగ్ కేంద్రాల వారీగా ఏర్పాటు చేసిన బూత్‌ల పరిధిలో ఓటర్ల జాబితా మారడంతో కొంతమేర ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఒకే వార్డులోని కొంతమంది ఓట్లు ఇతర బూత్‌లకు షిఫ్టు కావడంతో చాలా మంది తికమకకు గురయ్యారు. అయితే అక్కడే ఉన్న పోలింగ్ సిబ్బంది చొరవ తీసుకుని ఓటు ఉన్న పీఎస్‌కు పంపించారు. గతంలో లేని విధంగా బూత్‌ల మార్పిడి ఏమిటని పలువురు ఓటర్లు ప్రశ్నించారు. కాగా మూడు నియోజకవర్గాల పరిధిలో వందశాతం ఓటరు స్లిప్పులను పంపిణీ చేసినట్లు అధికారులు చెప్పినప్పటికీ.. ఓటింగ్ రోజు వారి నిర్లక్ష్యం బహిర్గతమైయింది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు స్లిప్పులు లేనిదే ఓటు వేసేందుకు ఒప్పుకోలేదు. దీంతో ఓటర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

పైసల పరేషాన్

ఆయా రాజకీయ పార్టీలు ఓటుకు నోటు ఇచ్చిన సంగతి తెలిసిందే. బూత్‌ల వారీగా ఓటర్లకు డబ్బులు ముట్టజెప్పగా, అదే వార్డులో ఉన్న కొంతమంది ఓటర్లు.. మరో బూత్‌కు బదిలీ అయ్యారు. పక్కనే ఉన్న ఓ కుటుంబానికి డబ్బులు రాగా.. ఎదురుగా ఉన్న ఓటర్లకు రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. వార్డు ఇన్‌చార్జ్ వద్దకు వెళ్లి డబ్బులు ఏవని ప్రశ్నిస్తే మీ ఓటు మరో బూత్‌కు షిఫ్టు చేశారు.. నా బాధ్యత కాదని చెప్పడంతో అలకపాన్పు వేశారు. ఇంతటితో ఊరుకోకుండా ఆ పార్టీల ముఖ్య ప్రతినిధులకు ఫోన్ చేసి 'సారూ మాకు డబ్బులు రాలేదు.. ఓటు వేసేది ఎలా' అంటూ నిలదీయడంతో ఆఘమేఘాల మీద పంపించే ప్రయత్నం చేశారు.

ఓటు కోసం సొంత ఊర్లకు..

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి ఓటర్లు తరలివచ్చారు. బతుకు దెరువు కోసం వెళ్లిన కొందరు.. ఉన్నత చదువుల కోసం విద్యార్థులు, ఉద్యోగ రీత్యా మరికొందరు హైదరాబాద్, కర్ణాటక, ముంబయ్ తదితర ప్రాంతాల నుంచి ఒక్కరోజు ముందుగానే సొంత ఊర్లకు చేరుకున్నారు. గురువారం కూడా చాలా మంది వచ్చారు. పోలింగ్ కేంద్రాల వద్ద గంటల తరబడి నిరీక్షించి ఓటు హక్కును వినియోగించుకున్నారు.




బందోబస్తును పర్యవేక్షిస్తున్న డీసీపీ సీతారాం, ఇతర పోలీసు అధికారులు

క్లుప్తంగా

ఓటువేసేందుకు వెళ్తూ.. అనంతలోకాలకు..

- గోవిందాపూర్‌లో రోడ్డు ప్రమాదం
- అక్కడికక్కడే చిన్నారి మృతి, తండ్రికి తీవ్ర గాయాలు..

శాయంపేట/ భూపాలపల్లి రూరల్ : శాయంపేట మండలంలోని గోవిందాపూర్ దర్గా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ చిన్నారి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లా నేరేడుపల్లి గ్రామానికి చెందిన బోడకుంట్ల రాంబాబు హనుమకొండలో ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం ఎన్నికలలో తన ఓటు వినియోగించుకోవడానికి కూతురు సింధు వైష్ణవి(8)ని తీసుకుని ద్విచక్ర వాహనంపై నేరేడుపల్లికి వస్తున్నాడు. ఈ క్రమంలో గోవిందాపూర్ దర్గా సమీపంలో గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొనడంతో సింధువైష్ణవి అక్కడికక్కడే మృతి చెందింది. రాంబాబుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో వృద్ధురాలు..

కేసముద్రం: ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లడానికి సిద్ధమైన ఓ వృద్ధురాలు గుండెపోటుతో మృతి చెందింది. ఈ ఘటన గురువారం మండలంలోని కేసముద్రంవిలేజ్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొలిపాక వెంకటమ్మ(80) ఓటు వేయడానికి ఇంటి నుంచి బయటకు వెళ్లే క్రమంలో గుండెపోటుకు గురై మృతి చెందింది.

ఓటు వేసిన గంటకు అనారోగ్యంతో వృద్ధుడు..


ఎల్లయ్య(ఫైల్)

సంగెం: ఓటు హక్కు వినియోగించుకుని ఇంటికి వచ్చిన గంటకు అనారోగ్యంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన సంగెంలో జరిగింది. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సింగారపు ఎల్లయ్య(65) గురువారం ఓటు హక్కు వినియోగించుకున్నాడు. ఇంటికి వెళ్లిన గంట తర్వాత తుది శ్వాస విడిచాడు. మృతుడికి భార్య సూరమ్మ, నలుగురు కూతుళ్లు ఉన్నారు.

పల్లా వర్సెస్ కొమ్మూరి..

- పరుష పదజాలంతో దూషణల పర్వం
- అడుగడుగునా టెన్షన్.. టెన్షన్
- పలుచోట్ల లాఠీచార్జ్
- రంగంలోకి డీసీపీ, ఏసీపీ, పోలీసు బలగాలు
- పసరమడ్లలో కాంగ్రెస్‌కు ఓట్లు వేయిస్తున్నారని అభ్యంతరం


జనగామ ప్రభుత్వ కళాశాల పోలింగ్ కేంద్రంలో ఆయా పార్టీల శ్రేణుల మధ్య వాగ్వాదం

జనగామ: తెలంగాణ అసెంబ్లీ పోలింగ్ సందర్భంగా గురువారం బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య జరిగిన ఉద్రిక్త పరిస్థితులు పోలీసులకు ముచ్చెమటలు పట్టించాయి. బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఆయన సతీమణి నీలిమ, కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఆయన తనయుడు ప్రశాంత్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి, ఆయా పార్టీల కేడర్ ఎదురు పడితేచాలు.. మాటల తూటాలు అగ్గిరాజేశాయి. దీంతో పోలీసు శాఖ అలర్ట్ అయింది. డీసీపీ సీతారాం నేతృత్వంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, స్థానిక పోలీసులతో పాటు బీఎస్ఎఫ్ బలగాలు రంగంలోకి దిగారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారనున్న నేపథ్యంలో అదనపు బలగాలు రప్పించారు.జనగామ పట్టణం, మండల పరిధిలో జరిగిన గొడవలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలోని 8 మండలాలను అలర్ట్ చేశారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఇరు కుటుంబాల సభ్యులు, ఆరుట్ల దశమంతరెడ్డి ఆయా మండలాల పరిధిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించే క్రమంలో పోలీసులు రెగ్యులర్ కంటే అదనంగా బందోబస్తు చేపట్టారు.

అడుగడుగునా టెన్షన్ టెన్షన్..

జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ పోలింగ్ కేంద్రానికి పల్లా సతీమణి నీలిమ వెళ్లగా, అదే సమయంలో కొమ్మూరి కుమారుడు ప్రశాంత్‌రెడ్డి, కోడలు దివ్య కూడా వెళ్లారు. ప్రతి చోటకు తమ వెనకనే రావడం ఏంటని నీలిమ వారిని నిలదీశారు. బయట నుంచి ప్రైవేట్ వ్యక్తులను తీసుకొచ్చి దొంగ ఓట్లు వేయిస్తున్నారని ప్రశాంత్‌రెడ్డి నిలదీయడంతో ఇరువురి మధ్య మాటల యుద్ధం జరిగింది. విషయం తెలుసుకున్న ఇరుపార్టీల శ్రేణులు ఘటనాస్థలికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. డీసీపీ వచ్చి నీలిమ, ప్రశాంత్‌రెడ్డికి నచ్చ చెప్పి పంపించారు. అయితే ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎంతకూ వినకపోవడంతో చెదరగొట్టారు. ఈ క్రమంలో రైల్వేస్టేషన్ ఏరియా ప్రభుత్వ స్కూల్ పోలింగ్ కేంద్రానికి పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాగా, ఆయన వెంట ఉన్న ఓ వ్యక్తిని ఆయా పార్టీల నాయకులు అనుమానించడంతో.. అక్కడే ఉన్న బీజేపీ అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, సీపీఎం నాయకులు జత కలవడంతో ఆ వ్యక్తిని


ఘర్షణ పడుతున్న కార్యకర్తలను ఆపుతున్న పోలీసులు


లాఠీచార్జ్ చేస్తున్న పోలీసులు

చితక బాదారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు సైతం రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో పోలీసులు మరోసారి చెదరగొట్టారు.

అభ్యర్థుల పరుష పదజాలం..

గొడవ సద్దుమణిగిందనుకుంటున్న తరుణంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి పట్టణంలోని గ్రెయిన్ మార్కెట్ పోలింగ్ కేంద్రానికి రాగా అనుచరవర్గంతో ఎలా వస్తారని కాంగ్రెస్ శ్రేణులు నిలదీశాయి. కొమ్మూరి కుమారుడు ప్రశాంత్‌రెడ్డి కూడా ఆగ్రహం వ్యక్తం చేయడం, ఇరువురి వాహనాలకు కేడర్ అడ్డుతగలడంతో స్వల్ప ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. లాఠీ చార్జ్ చేసే వరకూ కార్యకర్తలు అక్కడ నుంచి కదల లేదు. గ్రెయిన్ మార్కెట్ నుంచి పల్లా నేరుగా జనగామ మండలం శామీర్‌పేట పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ సైతం గులాబీ కండువా వివాదం తలెత్తడం, అదే సమయంలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి రావడంతో ఇరువురు పరుష పదజాలంతో దూషించుకున్నారు. చూసుకుందాం అంటే.. చూసుకుందాం అంటూ సవాల్ విసురుకున్నారు. దీంతో రెండు పార్టీల నేతలు, కార్యకర్తలు నినాదాలతో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఇరు వర్గాలను పోలీసులు బలవంతంగా బయటకు తీసుకురాగా, అక్కడ కేడర్ అడ్డుపడ్డారు. ఇరువురు ఘర్షణపడే సమయంలో పోలీసులు ఎక్కడికక్కడ లాఠీలతో చెదరగొట్టారు. అలాగే, కొమ్మూరి వెళ్లే క్రమంలో పోలింగ్ కేంద్రానికి కొద్ది దూరంలో పార్టీ శ్రేణులతో మాట్లాడేందుకు ఆగగా, అటువైపు బీఆర్ఎస్ శ్రేణులు కదలడంతో గ్రహించిన పోలీసులు, వారిని అక్కడే నిలిపివేశారు.

పసరమడ్లలో ఉద్రిక్తత

జనగామ మండలం పసరమడ్లలోని ఓ పోలింగ్ బూత్‌లో ఓ బీఎల్ఓ వృద్ధురాలిని తీసుకెళ్లి కాంగ్రెస్‌కు ఓటు వేయిస్తున్నారని బీఆర్ఎస్ ఏజెంట్ ఆరోపించారు. వెంటనే పల్లా సతీమణి నీలిమకు సమాచారం అందించగా ఆమె తమ అనుచరులతో కలిసి అక్కడకు వెళ్లారు. ఈ విషయమై నీలిమ నిలదీయంతో ఇరువురి మధ్య మాటామాటా పెరిగింది. అంతకు ముందుగానే పోలీసులకు సమాచారం రావడంతో అక్కడ ఎలాంటి దాడులు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. జనగామ మండలం గోపిరాజుపల్లిలో ఆయా పార్టీల కార్యకర్తల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. అలాగే ఓబుల్‌కేశ్వాపూర్, వడ్లకొండ గ్రామాల్లో సైతం స్వల్ప ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం పోలింగ్ ముగిసే వరకు పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

ఉద్రిక్తతలు.. ఘర్షణలు


ఏటూరునాగారంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల తోపులాట


ఖానాపురం: బుధరావుపేటలో ఘర్షణ పడుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు

- పోలింగ్ కేంద్రాల వద్ద పలు పార్టీల శ్రేణుల బాహాబాహీ
- ఇరువర్గాలను చెదరగొట్టిన పోలీసులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన కేంద్రం బయట పోలింగ్ సమయం 4 గంటలు దాటగానే చివరి నిమిషాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు ఒకరినొకరు దూషించుకున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సీతక్క పోలింగ్ కేంద్రంలోకి వస్తుండగా బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ఓడిపోతుందని నినాదాలు చేయడంతో ఘర్షణ నెలకొంది. అలాగే, బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి ఓడిపోతుందని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొనడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో సీఐ మండల రాజు, సిబ్బంది వారిని చెదరగొట్టారు.

ఖానాపురంలో..

ఖానాపురం:మండల వ్యాప్తంగా పలు పోలింగ్ బూత్‌ల్లో ఘర్షణలు చోటు చేసుకున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు పోలింగ్ బూత్‌ల్లోకి వచ్చి ప్రచారం చేపట్టారు. దీంతో ఇరువర్గాలు పరస్పర దూషణలకు దిగడంతో ఘర్షణలు జరిగాయి. అశోక్‌నగర్, బుధరావుపేట, ఖానాపురం, కొత్తిమాటుతండాతో పాటు పలు గ్రామాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణలు చోటు చేసుకొని ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నారు. ఖానాపురం, బుధరావుపేట, అశోక్‌నగర్ పోలింగ్ బూత్‌లలో ఇరువర్గాలు పరస్పర దాడులకు పాల్పడ్డాయి. దీంతో ఘర్షణల నడుమ పోలింగ్ కొనసాగింది. ఘర్షణల సందర్భంగా ఇరు వర్గాలను సీఐ పుల్యాల కిషన్, ఎస్సై మాధవ్ చెదరగొట్టారు. పలు పోలింగ్ బూత్‌లను ఏసీపీ తిరుమల్ పరిశీలించి పలు సూచనలు చేశారు.

పర్వతగిరిలో..

పర్వతగిరి: మండల కేంద్రంలోని పోలింగ్ బూత్ బయట బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య గొడవ జరిగింది. బీఆర్ఎస్ కార్యకర్తలు పోలింగ్ బూత్ వద్దకు చేరుకున్న సమయంలో కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. ఒకే సారి గుంపుగా పోలింగ్ బూత్ వద్దకు రావడం సరికాదని కాంగ్రెస్ నాయకులు పేర్కొనగా ఇరుపార్టీల శ్రేణులు మధ్య గొడవ జరిగింది.

ఓటర్లపై పోలీసుల దురుసు ప్రవర్తన


క్షతగాత్రులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొండా సురేఖ

ఖిలా వరంగల్: వరంగల్ 33వ డివిజన్ పెరకవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. సాయంత్రం 4.45 నిమిషాలకు పోలింగ్ బూత్‌కు ఒక్కసారిగా ఓటర్లు భారీగా చేరుకోవడంతో క్యూలైన్‌లో తోపులాట జరిగింది. దీంతో బీఎస్ఎఫ్ బలగాలు ఒక్కసారిగా లాఠీ ఝూలిపించారు. దీంతో అవినాష్, జడల సతీష్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొండా సురేఖ క్షతగాత్రులను పరామర్శించారు. సెంట్రల్ డీసీపీ ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

కన్నాయిగూడెంలో..

కన్నాయిగూడెం: మండలంలో జరిగిన పోలింగ్‌లో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. ముప్పనపల్లిలో ఓటు వేయడానికి క్యూలైన్‌లో ఓటర్లపై సీఆర్పీఎఫ్ సిబ్బంది లాఠీ ఝూలిపించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఓటర్లు సీఆర్‌పీఎఫ్ సిబ్బందిపై మూకుమ్మడిగా వెళ్లడంతో వెనుదిరిగారు. కొంత మందికి లాఠీ దెబ్బలతో వాతలు వచ్చాయి.


కన్నాయిగూడెం : చేతిపై కనిపిస్తున్న లాఠీ దెబ్బలు


న్యూశాయంపేటలో ఓటు హక్కు వినియోగించుకున్న బండా ప్రకాశ్ కుటుంబీకులు


కురవి పెద్ద తండాలో మంత్రి సత్యవతి ..


మానుకోటలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపీ కవిత కుటుంబ సభ్యులు


భూపాలపల్లిలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి..


జులైవాడలో టీఎస్‌పీఎస్సీ సభ్యుడి కారం రవీందర్‌రెడ్డి దంపతులు


న్యూశాయంపేటలో రావుపద్మ..


హనుమకొండలో సీపీఐ నేత తక్కళ్లపల్లి..


బచ్చన్నపేటలో మాజీ చీఫ్ విప్ బోడకుంటి..


మానుకోటలో కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్ ..


శాయంపేట: గోవిందాపూర్‌లో ఓటు వినియోగించుకున్న వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి


నడికూడ: వరికోల్ గ్రామంలో ఓటు వేసిన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి


నక్కలగుట్టలో టీఎన్జీవో మాజీ చైర్మన్ సుబ్బారావు..


న్యూశాయంపేటలో మంద కృష్ణ మాదిగ..


హనుమకొండ టీచర్స్‌కాలనీలో ఓటు హక్కు వినియోగించకున్న కడియం శ్రీహరి కుటుంబీకులు


వరంగల్ ఆంధ్రబాలిక కాలేజీలో ఓటు హక్కు వినియోగించుకున్న మేయర్ గుండు సుధారాణి..


ఏనుగల్లులో ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిలబడిన వృద్ధురాలు


జనగామ జిల్లా కేంద్రంలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద సెల్ఫీ తీసుకుంటున్న మహిళలు

పోల్.. కూల్..

- ప్రశాంతంగా ముగిసిన తెలంగాణ శాసనసభ ఎన్నికలు
- ఉదయం 7 గంటలకే బారులుదీరిన ఓటర్లు
- ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

తెలంగాణ శాసనసభ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. చెదురు ముదురు ఘటనలు మినహా సాఫీగా సాగింది. పోలింగ్ గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమై రాత్రి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచే ఓటువేయడానికి ఓటర్లు క్యూలైన్లలో బారులు దీరారు. కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించగా కొంత సేపు పోలింగ్‌కు అంతరాయం కలిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

- సాక్షి నెట్‌వర్క్



మొదటి సారి ఓటు హక్కు వినియోగించుకున్న యువతులు


ఏటూరునాగారంలో చిన్నారిని తీసుకుని ఓటు వేసేందుకు వచ్చిన మహిళ


భూపాలపల్లిలో ఓటు వేసేందుకు వృద్ధులు, దివ్యాంగులను తీసుకువస్తున్న కుటుంబ సభ్యులు, సహాయకులు


కేసముద్రం మండలం అమీనాపురంలో..


హనుమకొండ న్యూశాయంపేటలో..


మహబూబాబాద్: వేమునూరులో ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిలబడిన మహిళలు


నర్సంపేటలో ఓటు వేసిన 105 ఏళ్ల వృద్ధురాలు సత్తెమ్మ


కరీమాబాద్‌లో ఓటు వేసిన ట్రాన్స్‌జెండర్లు